కథ

గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన హాస్య కథ

# డ్రీమ్ మర్చంట్స్

ప్రసన్నకుమార్ సర్రాజు

"ఇదుగో! ఈ ప్రకటన చూడండి" అని పేపరందించింది ఇందిర. కళ్యాణమూర్తి ప్రకటన పడినంత మేరా మడిచి ఇచ్చిన దినపత్రిక తీసుకుని చూశాడు. కాస్త పరీక్షగా చూసి, భార్యతో "పాపం! అందరిదీ కాస్త అటూ యిటూగా మన భార్గవగాడి వయసే... ఒకేసారి ఆడా మగా మొత్తం పదిహేనుమందీ తప్పిపోయారా! ఈ మధ్య కిడ్నాపులు ఎక్కువయిపోయాయి" అన్నాడు.

"ఖర్మ..." అని ఇందిర టీవీ మీద పెట్టిన కళ్ళజోడు తెచ్చి యిచ్చింది.

అది పెట్టుకుని మళ్ళీ చూశాడు. "ఓ! ఇదేదో కోచింగ్ సెంటర్ యాడ్" అన్నాడు.

"అవును. ఎమ్. డి. ఎ. యు కాలేజి. ఆ ఫొటోల్లో వున్న వాళ్లందరూ తప్పిపోయినాళ్ళు కాదు. టాప్ ర్యాంకర్లు" అంది ఇందిర.

"అరే! నిజమా! ఈ కాలేజీ కొత్తగా పెట్టారు లాగుంది. ఈ పేరు ఇంతకుముందు ఎక్కడా వినలేదే" అని ఆశ్చర్యపడ్డాడు మూర్తి.

"పెట్టి రెండు సంవత్సరాలపైనే అయింది. చూడండి. ఈ కొద్దికాలంలోనే ఎంత గొప్ప రిజల్ట్సు సాధించారో. మన భార్గవని కూడా యిందులో చేర్పిద్దామండీ. వాడికి టెన్త్‌లో ఎయిటీ ఫైవ్ పర్సంటొచ్చింది గదా! మనబ్బాయి లాంటి బ్రిలియంట్‌కి ఈ కాలేజీయే బెస్ట్.." అంది ఇందిర.

"అలాగేగానీ, నాకు ఈ ఎడ్మిషన్లూ, వెళ్ళి వాళ్ళతో మాట్లాడటాలూ వీటన్నింటికీ టైము లేదుగా? ఎలా?"



"నాకు తెలుసు. మీరు ఆఫీసుకు ఒక్కరోజు కూడా నాగా పెట్టరని. పైగా మీ లోకం మీది. ఈ కాలం గురించీ, ప్రపంచం ఎంత స్పీడుగా పరుగెడుతోందో మీకు తెలీదని నాకు తెలుసు. అందుకే మా తమ్ముడికి ఫోన్ చేసి ఆ కాలేజీ బ్రోషర్ తెప్పించా. ఒరేయ్ వంశీ! టిఫిన్ తింటం అయిందా? తొందరగా రా.." అని కేకేసింది.

"వంశీ వచ్చాడా!" అంటూండగానే మూతి తుడుచుకుంటూ వచ్చి బ్రోషర్ అందించి, ప్రక్కనే స్టూలుమీద కూర్చున్నాడు వంశీ.

నలభై



పేజీల- కళ్ళు తిరిగే కలర్స్‌లో అత్యంత ఖరీదైన పేపర్‌తో వుందది- సావనీర్ సైజులో.

ముఖ చిత్రం చిరంజీవి.

"ఇదేంట్రా! కాలేజీ బ్రోషర్‌ని ఏదో సినిమా పత్రిక ఇచ్చావ్!" అన్నాడు మూర్తి.

వంశీ విలాసంగా నవ్వి, "బావా! ఈ రోజుల్లో సెలబిలిటీకీ పబ్లిసిటీకీ ఫేమస్ ఫిగర్స్‌ని వాడుకోవటం మామూలయింది. చిరంజీవి ఈ కాలేజీ ఓపెనింగ్‌కి రిబ్బన్ కట్ చేశాడ్లే. అదీ గాక చిరంజీవి ఫొటో వెయ్యకుండా ఏ గౌతమబుద్ధుడిదో సరస్వతీ దేవి ఫొటోనో వేస్తే ఇన్ని కాలేజీల కాంపిటీషన్లో ప్రత్యేకంగా ఈ ఎమ్ డి ఎ యు సావనీర్‌నే ఎందుకు చూస్తారు?" అన్నాడు వంశీ.

మూర్తి తలగోక్కుంటూ "ఇంతకీ ఎమ్ డి ఎ యు కాలేజ్ అంటే ఏమిట్రా?" అని అడిగాడు.

"ఎమ్ డి ఎ యు అంటే మమ్మీ డాడీ ఆంటీ అంకుల్ కళాశాల అని అర్థం" అన్నాడు.

"అంతటితో ఆగారేం? అక్క, బావ, వదిన, షడ్డకుడూ వగైరా కూడా తగిలించొచ్చుగా!" అన్నాడు మూర్తి కొంచెం చిరాగ్గా.

"అబ్బ... కాస్త మీ చిరాకుని పక్కనపెట్టి, బ్రోషర్ తిరగెయ్యండీ! ఫీజులెంతో, టైమింగ్సేమిటో తెలుస్తాయ్... ఐదొందలు పెట్టి కొన్నదెందుకూ?" అంది ఇందిర.

"ఐదొందలా!" నిర్ఘాంతపోయాడు మూర్తి.

"మరి చిరంజీవి బొమ్మా మజాకానా? అసలు వాళ్ళు వాడిన పేపర్‌కీ ఫొటోలకే అవుతుంది" అన్నాడు వంశీ.

ఆ రాహుకాలంలో ఆ వర్జ్య సమయంలో ఎడంకన్ను అదురుతున్న దుర్ముహూర్తంలో పేజీ తిరగేశాడు మూర్తి.

ఒకటవ పేజీలో పెద్ద బొజ్జ లేసుకుని, పగలబడి నవ్వుతున్న ఫోజులో చేతులు జోడిస్తూ ఒక జంట ఫొటో ఫుల్‌పేజీలో ఉంది.

"వీళ్ళే బావా! ఈ కాలేజ్ ఫౌండర్స్!" వివరణ యిచ్చాడు వంశీ.

రెండో పేజీ తిప్పగానే ఆరు మడతలుపెట్టిన 1/8 డెమ్మీ సైజులో ఆ కాలేజీ క్యాంపస్ ఫొటో ఉంది. ఈ చివర్నించి ఆ చివరివరకూ వైట్‌హౌస్ లెవెల్లో ఉంది.

ఇక తరువాత పేజీల్లో, పేజీ పైభాగంలో చిరంజీవి రిబ్బన్ కటింగులూ, ల్యాబ్ ఓపెనింగూ, స్పోర్ట్స్ మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతూ, పిల్లలతో డైనింగ్ టేబిల్ మీద భోంచేస్తూ.. ఇలాగ ఫొటోలున్నాయి. పేజీల కింద భాగంలో, చిరంజీవి అందాల సినీతారలతో డ్యాన్సులు చేస్తున్న ఫొటోలున్నాయి. ఒక పేజీలో వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం కింద రెయిన్ సాంగు ఫొటో ఉంది.

"ఇంతకీ ఫీజుల గురించి ఎక్కడ రాశారు?" అన్నాడు మూర్తి టైము చూసుకుంటూ ఇంకో పావుగంటలో ఆఫీసుకి బయల్దేరాలి.

బావగారికి ఫీజు వివరాల పేజీ చూపిద్దామని వంశీ పేజీలు తిప్పుతూంటే ఒక ఫొటోలో ఎద్దుల్లాంటి ముగ్గురు పిల్లలకు ఫౌండరు మాడమ్ గోరుముద్దలు తినిపిస్తోంది. ఫౌండరు సారు గుర్రంలాగా ఒంగి వుంటే ఓ పిల్లాడు ఎక్కి వూరేగుతున్నాడు.


"ఇదిగో బావా" అని చివ్వరి పేజీ చూపించాడు. భార్గవ చేరతానన్న కోర్సు హాస్టలర్స్‌కైతే నలభైవేలు, డే స్కాలర్స్‌కైతే (అంటే ఇంట్లోనే వుంటూ కాలేజీ కెళ్ళి రావడమన్నమాట) ముప్పై వేలూ అని ఉంది.

మూర్తి గుండె కొట్టుకుంది. తన ఇంజనీరింగు చదువే మొత్తం మూడు వేలల్లో అయిపోయింది. ఈ ముప్పై వేలూ నలభైవేలూ ఏమిటి?

టైమింగ్సు చూశాడు. హాస్టల్లో వుండి చదువుకునే వారికి స్టడీ అవర్స్ ఇరవై నాలుగు గంటలూట. డే స్కాలర్స్ కైతే కేవలం పదమూడు గంటలేట. అంటే పొద్దున్నే ఏడున్నరకు వెళ్ళి రాత్రి ఎనిమిదిన్నరకు వస్తాడన్నమాట. నలభై వేలు దగ్గర ఒక చుక్కవుంది. కింద చూస్తే అన్ని ఖర్చులూ కలుపుకుని, స్థానిక పన్నులు అదనం. నోహిడెన్ కాస్ట్. అని ఉంది.

"ఏమండీ! మనవాణ్ణి హాస్టల్లో చేర్పిద్దామండీ. పసిబిడ్డ.. అంత పొద్దున్నే లేచి లంచ్‌బాక్సు తీసుకుని వెళ్లి, మళ్లీ రాత్రి తొమ్మిదింటికి వస్తే చాలా హైరానపడిపోతాడు" అంది ఇందిర. భార్యవైపు సూటిగా చూశాడు మూర్తి.

**నా**గురించి చెప్పుకోవటానికి ఏంలేదు. కథకుడి కన్నా కథ ముఖ్యం. సీరియస్‌గా రాస్తే సామాజిక స్పృహతో చదవరేమోనని, ఎంత పెద్ద సమస్యనైనా కొంచెం సెటైర్ కలిపి చెప్పటం నా అలవాటు.



చెప్పే అవకాశం ఎడిటర్‌గారు ఇచ్చారుగదా అని చెప్తున్నాను.

పాతికేళ్లక్రితం, ఇప్పటితో పోల్చుకుంటే జనాభా తక్కువా, దుర్మార్గమూ తక్కువే. అయినా రచయితలూ, రచయిత్రులూ నిశితంగా సమాజ పరిశీలనచేసి నిస్సంకోచంగా కథా భాగాలు వదిలేవారు. అలాగే నవలలు రాస్తే వాటిల్లోని వస్తువు మొత్తం ఒక వి హెడ్ డి లెవెల్లో వుండేవి. అప్పట్లో రైటర్స్ కమిట్‌మెంట్ అలా వుండేది.

నేటి పరిస్థితులు చూస్తున్నారుగా! 'వీళ్లింతే... ఏం చెప్పినా ఎంత చెప్పినా మారరు...' అనుకుంటూ పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న మేధావి రచయితలూ! మీరు కలం పట్టవలసిన సమయం ఇదే. వంటింట్లో కూరమాడిపోతుంటే దిగ్గున లేచి వెళ్లి మంట తగ్గిస్తాం. ఎందుకంటే ఆ వంట తినాల్సింది మనమే గాబట్టి. సమాజం గూడా ఓ వంటగదే... తీసుకున్న విశ్రాంతి చాలు.

'విరామ రచయితలూ-రచయిత్రులూ!' కలమూ, సిరాబుడ్డీ, తెల్లకాగితాలూ తెచ్చుకోండి. మనుష్యుల హృదయాల్లో తడి ఆవిరైపోతుంది. వీళ్లని కాపాడరూ?

-ప్రసన్న

భార్య కుట్ర అర్థమైంది. "మా ఇంజనీర్లకు హాస్టలేమీ లేదు. నేను కూడా హాస్టల్లో చేరిపోతే హాయిగా తెల్లవారు ఝామునుంచీ అర్ధరాత్రి దాకా సీరియళ్ళు చూసుకోవచ్చని ప్లాను" అనుకున్నాడు మనసులో.

"ఇంక నువ్వేమీ ఆలోచించకు బావా! రేపొక్క పూట సెలవు పెట్టేయ్. వెళ్ళి మాట్లాడొచ్చేద్దాం. మొత్తం డబ్బులన్నీ ఒక్కసారే కట్టక్కర్లేదట. పైగా మనాడి మార్కులు చూసి డిస్కౌంటు కూడా ఇస్తారు" అన్నాడు వంశీ.

***

మధ్య తరగతి మారుతీకారులో ముగ్గురూ కాలేజీ క్యాంపస్‌లో కెళ్ళారు. అతి కష్టంమీద ఓ షెవర్లెట్ కీ బెంజి కారుకీ మధ్య కూసింత పార్కింగ్ జాగా దొరికింది. అన్ని కార్లున్నాయి మరి.

ముగ్గురూ లోపలికెళ్ళారు. పెద్ద హాలు. గందరగోళంగా ఎవరి గోలలో వాళ్ళున్నారు.

అందమైన ఓ ముప్పై ఏళ్ళ యువతి వచ్చి మూర్తికి షేక్‌హ్యాండిచ్చి చిరునవ్వు నవ్వింది. టక్ చేసుకుని, టై కట్టుకున్న ఒకతను ఇందిరకు నమస్తే చెప్పాడు. పద్దెనిమిదేళ్ళ ఓ అమ్మాయి వంశీ భుజం మీద చెయ్యేసి "రండి" అంది చనువుగా. నడుస్తూనే పరిచయాలు అయ్యాయి.

మూర్తి పక్కనున్న యువతి అడిగింది. "ఏ గ్రూపు?"

"ఎ పాజిటివ్" అన్నాడు మూర్తి కాస్త తడబడుతూ. ఆమె నవ్వు. " బ్లడ్ గ్రూప్కాదు. మీ అబ్బాయి తీసుకునే గ్రూపు" అంది.

"అదా! ఎమ్పీసీ" చెప్పాడు.

ఓరగా ఇందిరవైపు చూశాడు మూర్తి. జీవితంలో ఇక పరాయి మొగాడితో మాట్లాడ్డం కుదరదేమో అన్నంత ఉత్సాహంగా నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతోంది. వంశీ అయితే అసలీ లోకంలోనే లేడు.

ఇరవై రెండేళ్ళ వెధవ... ఇంకా జీవితంలో సెటిలవలేదు. ఏమిటీ ఇకిలింపులూ సకిలింపూలు ఆ అమ్మాయితో?

"అసలు ఈ కార్పొరేట్ కళాశాలల పద్ధతే వేరు. ఎంత గొప్పగా రిసీవ్ చేసుకున్నారో చూశారా?" అంది ఇందిర మూర్తి చెవిలో రహస్యంగా.

ఎమ్ డి రూమ్ దగ్గర సోఫాల్లో ఓ పాతికమంది వెయిట్ చేస్తున్నారు- చేతుల్లో టోకెన్లు పెట్టుకుని. వీళ్ళు కూడా టోకెన్ తీసుకున్నారు. మూర్తితో వచ్చినావిడా, ఇందిరతో వచ్చినాయనా సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. వేరే జంట అన్వేషణలో. వంశీ పక్కన అమ్మాయి వాళ్ళతో "మీరెళ్ళండి. నేను వీళ్ళకు క్యాంపస్ అంతా చూపించి వస్తాను" అంది. తన పేరు పుష్యగామిట.

అదేం పేరు? జలాంతర్గామిలా అనుకున్నాడు మూర్తి.

"మనవంతు వచ్చేసరికీ ఇంకా గంట పడుతుంది. రండి. అలా తిరిగొద్దాం" అంటూ లేచి వంశీకి చెయ్యందించింది. వంశీ చటుక్కున లేచాడు. ఆ అమ్మాయి చెయ్యి వదలకుండానే "వదండక్కాయ్" అన్నాడు.

వరండాలో నడుస్తున్నారు. అటూ ఇటూ క్లాసు రూములు. చాలా నిశ్శబ్దంగా ఉంది.

"ఇదేమిటి? టీచర్లు పాఠాలు చెప్పట్లేదా? క్లాసులన్నీ సైలెంటుగా ఉన్నాయి?" అన్నాడు మూర్తి.

పుషగామినవ్వి, ఒక క్లాసు రూము విండో దగ్గర ఆగింది. టీచరమ్మ జాకెట్టుకి గుచ్చి, ఒక కాలర్ మైక్ ఉంది. అది వైర్ లెస్ మైకుట. స్టూడెంట్లందరికీ తలమీద చిన్నసైజు హెల్మెట్స్ లాగా ఇయర్ ఫోన్లున్నాయి. ఆవిడ రహస్యంగా పాఠాలు చెపుతోంది. మూడో చెవి వాడికి వినబడకుండా. ఆవిడ వాయిస్ స్టూడెంట్స్ చెవుల్లో బాగానే వినపడతాయట. ఎందుకిలా అంటే సౌండ్ పొల్యూషన్ తగ్గించటానికట.

మూర్తి గమనించాడు సగం మందికి పైగా పిల్లలకి కళ్ళద్దాలున్నాయి.

తను చిన్నప్పుడు చదువుకున్న స్కూలు జ్ఞాపకం చేసుకున్నాడు మూర్తి. హాయిగా, ఓ పెంకుటింట్లో పిల్లల సందడి, టీచరమ్మ గదమాయింపులూ, కిటికీ లోంచీ బయటకు చూస్తే పచ్చటి చెట్లూ, క్లాసురూముల్లో గూడులు కట్టుకుని స్వేచ్ఛగా లోపలికి వస్తూ పోతూ కిచకిచమని శబ్దాలు చేసే పిచ్చుకలు, ఇక్కడేంటి? మాటా పలుకూ లేకుండా! ఈ ఇంటర్ మీడియెట్ పిల్లలకు పెద్దబాల 'శిక్ష' లా గుంది.

హాస్టల్ దూరంగా కనిపిస్తోంది. కిందకు దిగారు. ఇందాక కనిపించలేదు గానీ, ఒక గది ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆ గదిపై గడపకి "కొట్టుడుగది" అని రాసి ఉంది. లోపల ఓ నలభై ఏళ్ళ ఆవిడ కూర్చుని ఉంది. వెనకాల గోడలకి పూర్వకాలంలో రాజుల కోటల్లో గోడలకి ఇంటూ మార్కులుగా ఖడ్గాలు వ్రేలాడుతున్నట్లు బెత్తాలు వ్రేలాడుతున్నాయి. ఆవిడ ఒక బెత్తానికి షార్ప్‌గా పదును పెడుతోంది.

అప్పుడే ఒక విద్యార్థి లోపలకు వచ్చాడు. బిక్కమొహం వేసుకుని, వాళ్ళ క్లాసు టీచర్ ఇచ్చిన చీటీ ఆమెకు చూపించాడు.

ఆవిడ టేబుల్ పక్కన కన్‌ఫెషన్ బాక్సులాంటిది ఉంది. ఆమె సౌంజ్ఞ చేయగానే ఆ బాక్సులో కెళ్ళి నిలబడ్డాడు ఆ కుర్రాడు.

"ఊ... చెప్పు ఏం చేశావు?" అంది. ఆ కుర్రాడు భయపడుతూ "ఈ రోజు క్లాసుకి

జామెట్రీ బాక్సు తెచ్చుకోలేదు మేడమ్?" అన్నాడు.

"ఊ... ఇంకా?"

"లంచ్ బాక్సులో కంపల్సరీగా ఓ యాపిల్‌పండు తెచ్చుకోవాలని రూలుందిగదా మాడమ్! మా డాడీ పొద్దున్నే స్కూటరేసుకుని ఊరంతా తిరిగారు. ఎక్కడా దొరకలేదు. అందుకనీ..."

"అంతేనా? ఇంకేమైనా చేశావా!" "టీచర్ ల్యాబ్‌కెళ్ళి ఐదు నిముషాల్లో తిరిగొచ్చారు. ఆ లోపల నేను నరేష్‌ని రామ్‌గోపాల్‌వర్మ భూత్ చూశావా అని అడిగానండీ"

"ఊ.. సరే బయటకురా" అని చాలా కూల్‌గా, ప్రొఫెషనల్‌గా బెత్తం తీసుకుని తొమ్మిదిసార్లు ఎడాపెడా కొట్టింది. తర్వాత ఓ స్లిప్పు మీద ఏదో రాసి, స్టాంపువేసి "మీ టీచర్ కివ్వు" అని మళ్ళీ బెత్తం సాన పెట్టుకుంటోంది. ఆ కుర్రాడు నీళ్ళు నిండిన కళ్ళతో వెళ్ళిపోయాడు.

మూర్తీ, ఇందిరా మొహామొహాలు చూసుకున్నారు. అప్పుడే.. వైస్ ప్రిన్సిపాలుట అటే వెడుతూ ఆమెను పలకరించాడు.

"ఏంటి సార్! ముప్పై కొత్త బెత్తాలు శాంక్షన్ చెయ్యమని అర్జీ పెడితే ఇరవైయే ఇచ్చారు? ఈ పాత బెత్తాలతో ఎంత అవస్థ పడుతున్నానో తెలుసా?" అంది గోముగా. వైస్ ప్రిన్సిపాల్ "నే చెప్తాలే స్టోర్ కీపర్‌కి" అని అనునయించి వెళ్ళిపోయాడు.

మూర్తి, ఇందిరా, వంశీ అక్కణ్ణుంచీ కదిలారు.

"అవునూ! పుష్యగామీ ఓకటీ రెండూ తప్పులు సరే. ఆ కుర్రాడి టీచర్ బయటికెళ్ళిన టైములో వాళ్ళు 'భూత్' గురించి మాట్లాడుకున్నట్లు ఆమెకెలా తెలిసిందీ?" అడిగాడు మూర్తి.

పుష్యగామి కిలకిలా నవ్వుతూ "అదేసార్ మా కార్పొరేట్ కాలేజీ ఆధునిక టెక్నాలజీ! బెంచీల కింద రహస్యంగా మైకులుంటాయి. స్టూడెంట్స్ మాట్లాడుకునే మాటల్ని రహస్యంగా ట్రేస్ చేస్తారు. టీచర్‌కి వెంటనే చెప్తారు. ఆవిడ శిక్షిస్తుంది" అంది.

"అవున్లూ! ఆ శిక్షేదో ఆవిడే అమలు చేయొచ్చుగదా! అడిగింది ఇందిర.

"లేదండీ... ఆవిడే కాదు చాలామంది టీచర్లు అహింసా మార్గాలలో నడుస్తుంటారు. అందరూ అహింసా వాదులే అందుకని 'వెళ్ళి కొట్టించుకురా' అని మర్యాదగా విద్యార్థి చేసిన తప్పులు స్లిప్పులు రాసి, 'కొట్టుడు గదికి' పంపిస్తారు." అంది పుష్యగామి. మూర్తీ, ఇందిరా భారంగా నిట్టూర్చారు.

హాస్టల్ వార్డెన్ అనుమతి తీసుకుని లోపలి కెళ్ళారు. మూడు అంతస్థులున్నాయి.

"హాస్టల్లో పిల్లలున్నారేమిటి? క్లాసులు జరుగుతున్నై కదా!" అన్నాడు మూర్తి.

"వీళ్ళు సప్లిమెంటరీ స్టూడెంట్స్. మళ్ళీ పరీక్షలు రాయాలి" అంది పుష్యగామి.

ఒక్కోగదీ చూసుకుంటూ వెడుతున్నారు. రూమ్స్ తలుపులు మూసివున్నై గానీ విండోస్ తెరిచే వున్నై. వాటికి కటకటాలలాగా ఇనుపచువ్వలున్నై. వీళ్ళ అలికిడి విని రూముల్లో పిల్లలు వచ్చి, కటకటాలు పట్టుకుని, అభావంతో, చూస్తున్నారు. కొందరి వదనాలు దిగులుగా వున్నాయి. కళ్ళకింద నల్లటి చారలు.


# గ్లోబల్ హాస్పిటల్స్.. సాదర స్వాగతం ...



డాక్టర్ సుభాష్ చంద్ర సమాల్
ఎం.డి, డి.ఎం
(గ్యాస్ట్రోఎంట్రాలజీ)

**గ్లో**బల్ హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందంలో ప్రముఖ మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు **డాక్టర్ సుభాష్ చంద్ర సమాల్** ఫుల్‌టైం సీనియర్ కన్సల్టెంట్‌గా చేరారని తెలియచేసేందుకు సంతోషిస్తున్నాము.

డాక్టర్ సమాల్, ఎం.డి, డి.ఎం (గ్యాస్ట్రోఎంట్రాలజీ) చేసి జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (జిప్‌మెర్) పాండిచ్చేరి, సి.ఎం.సి వెల్లూర్ లతో బాటు ఇతర ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు సేవలు అందించారు.

అన్నవాహిక, ఉదరం, కాలేయం, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్, పెద్ద, చిన్న ప్రేగులవ్యాధుల చికిత్సలో గ్లోబల్ హాస్పిటల్స్ ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నది. అవయవాల మార్పిడి శస్త్రచికిత్సల కోసం ముఖ్యంగా కాలేయ మార్పిడి ఆపరేషన్ల కోసం దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన సంస్థ.

గుర్తింపు:
ఇఎస్ఐ, ఎ.పి.ట్రాన్స్‌కో, ఎ.పి.జెన్‌కో, సిపిడిసిఎల్, ఎన్ఎండిసి, బిడిఎల్, ఎఫ్‌సిఐ

సి.జి.హెచ్, ఆరోగ్య భద్రత, దక్షిణ మధ్యరైల్వే, ఎన్‌టిపిసి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

GLOBAL HOSPITALS
Medical excellence through Teamwork

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, లివర్ డిసీజెస్, రీనల్ డిసీజెస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్.

**లకడీకాపూల్, హైదరాబాద్ 500 004. ఫోన్: 040-2324 4444 (10 లైన్లు)**

**వెబ్‌సైట్:** www.theglobalhospital.com


కొంతమంది పిల్లలకు భూతద్దాల కళ్ళజోళ్ళున్నాయి.

"వీళ్ళు క్లాసుల కెళ్ళరా?" అడిగాడు వంశీ.

"వీళ్ళు పగలంతా హాస్టల్లో చదువుకుని, రాత్రి భోజనాలు అయ్యాక నైట్‌క్లాసులకి వెడతారు."

"నైట్ క్లాసులా!"

"అవునండీ ఇరవై నాలుగ్గంటలూ చదివితే గానీ బాగా మార్కులు రావుగదా! ర్యాంకులు రాకపోతే మా కాలేజీకి ఎంత అప్రదిష్ట? నైట్‌క్లాసులకెళ్ళి మూడు గంటలకు వచ్చి, ఎంచక్కా నిద్రపోయి, మళ్ళీ నాలుగ్గంటలకు లేచి, చదువుకుంటారు. మా హాస్టల్ వార్డెన్ చాలా స్ట్రిక్టు. అన్ని రూముల్లోనూ బెల్లులు పెట్టించింది. కరక్టుగా తెల్లవారు ఝామున నాలుగ్గంటలకు తన రూములో బటన్ నొక్కుతుంది. ఆ శబ్దానికి



పెద్దపులైనా బెదురుతూ లేవాల్సిందే." చెప్పింది గొప్పగా.

"పోన్లే.. ఓ గంటయినా నిద్రపోనిస్తున్నారు" గొణుక్కున్నాడు మూర్తి. అది వినిపించింది పుష్యగామికి.

"అసలు మనిషికి రెండు మూడు గంటలకంటే నిద్ర అనవసరం సార్. ఎన్టీ రామారావుగారు రాత్రి పన్నెండింటికి పడుకుని, మళ్ళీ తెల్లవారు జామున మూడింటికే నిద్రలేచి పనుల్లోకి దిగిపోయేవారట. ఎక్కడో చదివాను" అంది.

"అవును.అందుకే ఆ మహానుభావుడు 'దిగి', పోయాడు" అన్నాడు మూర్తి.

"ఆ మాత్రం పెద్ద వయసు వారికి మూడుగంటల నిద్ర చాలితే పిల్లలు, వీళ్ళకి గంట నిద్రచాలు గదా!" అంది పుష్యగామి.

మూర్తీ, ఇందిరా, ఏమీ అనలేదు.

వరండా చివరి వరకూ వెళ్ళి "ఇక వెడదాం" అని తిరిగొస్తుంటే రూముల్లో పిల్లలు విండో నుంచీ వెనక్కి తిరిగి, తమ స్టడీ టేబుల్స్ దగ్గర కెడుతూంటే మూర్తి గమనించాడు. వాళ్ళ హాస్టల్ యూనిఫాం తెల్లచొక్కాలవెనక నెంబర్లున్నాయి.

మూర్తి తెల్లబోయి "ఆ నెంబర్లేమిటి?" అన్నాడు. పుష్యగామి చిరునవ్వుతో "ఇంత మంది పిల్లల పేర్లు గుర్తు పెట్టుకోవడం పాపం వార్డెన్ గారికి కష్టం కదా సార్! అందుకనే ఈ ఏర్పాటు." అంది.

అంతా కిందకి దిగారు. గేటుని సమీపిస్తుంటే లోపలే రెండు గదులున్నాయి. గేటుకి కొంచెం దూరంగా. ఒక గదిముందు ఇద్దరు తాళ్ళు పేనుతున్నారు. ఒకడు ఆ తాడుని ఆరడుగుల చొప్పున కట్ చేసి ఓ పక్కన మోపులా పెడుతున్నాడు.

"ఎందుకా తాళ్ళు?" అడిగాడు మూర్తి. పుష్యగామి మొహమాటంగా నవ్వి, "ఒక్కో సారి... స్టూడెంట్లు సైకలాజికల్‌గా పరీక్షలకు భయపడి... అప్పుడప్పుడూ.. అదే వెరీ రేర్‌గా.. సూసైడ్లు చేసుకుంటారు గదండీ? మా కార్పొరేట్ కాలేజీల హాస్టళ్ళలో అన్నీ ఖరీదైన దుప్పట్లూ, బెడ్‌షీట్లూ వుంటాయి. అవి పాడైపోతే. మాకు చెడ్డపేరు గదండీ. అందుకని" అంది పుష్యగామి.

"ఇక చాల్లే పోదాం పదండి బావా" అప్పటివరకూ ఆ పిల్ల చెయ్యిపట్టుకుని వున్న వంశీ ఆమెకు దూరంగా జరిగి అన్నాడు. గేటు లోంచీ బయటకు వస్తూ ఓరగా చూశాడు మూర్తి. ఆ రెండోగది వేపు. 'ఉరి వేసుకునే గదికి దారి' అని బాణం గుర్తుతో ఓ బోర్డుంది మొక్కల మధ్య...

***

ఆ రోజు ఆదివారం. మూర్తి ఆలోచిస్తూ పడక్కుర్చీలో కూర్చున్నాడు.

అమెరికావాళ్ళు అంతరిక్షంలో వాడే ప్రత్యేకమైన పెన్ను ఆ వాతావరణానికి అనుకూలంగా అంటే లోపల సిరా కక్కకుండా, పాళీ ఒంకర పోకుండా సిరాబుడ్డితో పనిలేకుండా, బాల్‌పాయింటయితే లీకవకుండా, దృఢంగా, అన్ని వాతావరణ పరిస్థితులనూ తట్టుకునే విధంగా తయారు చేయడానికి రెండేళ్ళ సమయమూ, రెండుకోట్ల డాలర్లూ ఖర్చు పెట్టారట.

అదే సమయంలో అదే అవసరం కోసం, రష్యన్లు సింపుల్‌గా పెన్సిల్ వాడారట.

నవ్వుకున్నాడు. పిల్లల తెలివితేటలూ, వాళ్ళ జ్ఞాపకశక్తీ, సామర్థ్యమూ చాలాభాగం వాళ్ళ వంశవృక్షంలో వుంటుంది. ఐన్‌స్టీన్ ఏ కార్పొరేట్ కాలేజీల్లో చదివాడు?న్యూటన్‌కి ఏమి డిగ్రీలున్నాయి? బాల్యాన్నీ, ప్రకృతినీ హాయిగా అనుభవించే వయసులో, ఆనందమంటే ఏమిటో తెలియక, ఈ భయంకరమైన పోటీలో. పాపం పిల్లలు. ఆ హాస్టల్లో పిల్లలను తల్చుకుని మూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఇదిగో... ఈ ప్రకటన చూడండి" అని పేపరందించింది ఇందిర.

మూర్తి ప్రకటన పడినంత మేరా మడిచి ఇచ్చిన దినపత్రిక తీసుకుని చూశాడు.

"ఇది ఇంకో కోచింగు సెంటరా! దాదాపు పది విద్యార్థుల ఫొటోలున్నాయి? అందరూ టాప్ ర్యాంకర్లా?" అడిగాడు మూర్తి. ఇందిర మౌనంగా టీవీ మీదున్న కళ్ళజోడు ఇచ్చింది మూర్తికి.

"కనబడుటలేదు. ఈకింది ఫొటోల్లోని పిల్లలు కిడ్నాప్ చేయబడ్డారు. వీళ్ళు ఒకరుగానీ, ఇద్దరుగానీ లేక మొత్తం పదిమందిగానీ, ఏదో ఒక కాలేజీ రెసిడెన్షియల్ హాస్టల్లో వుండి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిపినవారికి తగిన పారితోషికం ఇవ్వబడును".... మూర్తి, ఇందిరా ఒకళ్ళనొకళ్ళు చూసుకుని నవ్వుకున్నారు. ఆ నవ్వులో జీవం లేదు. ■

ఈ కథని సాంఘిక కథావిభాగానికి కాకుండా హాస్యకథల విభాగానికి పంపించాల్సొస్తున్నందుకు నా మీద నాకే జాలేస్తోంది. పేరెంట్స్ ఆఫ్ ఇండియా (లేక ఆంధ్రప్రదేశ్) నన్ను క్షమించగలరు.

\- రచయిత